సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను గరిష్ట ధర రూ.40,100

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40,100 పలికాయి. కనిష్టం రూ.19,200, సరాసరి రూ.38,600 ప్రకారం అమ్మకాలు సాగాయి.




టమాట కిలో రూ.35

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి ధర రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 33.5°/18.2°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

కప్పం కడితేనే రిజిస్ట్రేషన్!



ధర్మవరం మండలం రేగాటిపల్లిలో ఓ వ్యక్తి 19 ఎకరాలు కొనుగోలు చేసి వెంచర్ వేసేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న కూటమి నేత ఒకరు సదరు రియల్టర్‌తో పాటు భూ యజమానికి ఫోన్ చేశాడు. వెంచర్ ఏర్పాటు చేయాలంటే తనకు కొంత భూమిని రాసివ్వాలని, లేకపోతే పరిస్థితి తేడా ఉంటుందని హెచ్చరించాడు. దీంతో భూ యజమానులు కూటమి నాయకుడి సమీప బంధువు పేరిట 1.23 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3 కోట్ల దాకా ఉంటుంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధర్మవరానికి చెందిన కూటమి పార్టీల నాయకులు ఆదాయ మార్గాలు అన్వేషించారు. ఈక్రమంలో 180 ఎకరాల వరకు సెలెక్టెడ్ సర్వేనంబర్లను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపి ఆ భూముల రిజిస్ట్రేషన్లు చేయకూడదంటూ హుకుం జారీ చేశారు. దీంతో ఆయా సర్వే నంబర్లలోని భూముల్లోని ప్లాట్లు అమ్మాలన్నా, కొనాలన్నా కూటమి నేతలకు కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

... ఇలా.. నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై వాలిపోయారు. ప్లాట్ కొనుగోలు చేయాలన్నా తమ వద్ద అనుమతులు తీసుకోవాలంటూ ప్రజలను భయపెడుతున్నారు. మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరంలో కూటమి నేతల అధర్మ పాలన నడుస్తోంది.

'రియల్'... ఢమాల్!

- ధర్మవరంలో కూటమి నాయకుల దందా
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మకాం
- రిజిస్ట్రేషన్‌కు వెళ్లే వారితో భారీగా డిమాండ్
- వెంచర్ వేయాలంటే భూమిలో వాటా ఇవ్వాల్సిందే
- కాదంటే ప్లాట్లు రిజిస్టర్ జరగకుండా అడ్డంకులు
- కూటమి నేతల దౌర్జన్యాలతో భయపడిపోతున్న జనం
- స్థిరాస్తి కొనుగోళ్లకు విముఖత.. భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- 70 శాతానికిపైగా పడిపోయిన ప్రభుత్వ ఆదాయం



ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఎకరాకు రూ.10 లక్షల డిమాండ్

ధర్మవరం పట్టణంలో ఎవరైనా కొత్త వెంచర్ వేయాలంటే కూటమి నాయకులకు ఎకరాకు కనీసంగా రూ.10 లక్షల దాకా సమర్పించుకోవాలి. అలాంటి వెంచర్లకే అనుమతి ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. అంత డబ్బు నేతలకు ఇచ్చి ఆ భారం ప్రజలపై ఎందుకు మోపాలని భావించిన రియల్టర్లు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పెట్టుబడులు పెడుతున్నారు.

ధర్మవరం: పట్టుచీరల వ్యాపారంతో వాణిజ్య పరంగా పేరుగాంచిన ధర్మవరంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగేది. అందుకే ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం క్రయ, విక్రయాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ద్వితీయ స్థానంలో ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం, రియల్ ఎస్టేట్ రంగం జోరుగా సాగడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చేది. గతంలో ప్రతి నెలా 500 నుంచి 800 దాకా దస్తావేజులు రిజిస్టర్ అయ్యేవి. తద్వారా రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల దాకా ఆదాయం సమకూరేది.

ఆరునెలల్లోనే తలకిందులు

రియల్టర్లు ఎక్కడైనా వెంచర్ వేయాలంటే కప్పం కట్టాలని లేదా వెంచర్‌లో భాగం ఇవ్వాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక కొందరు కప్పం కట్టి పనులు చేయించుకుంటున్నారు. అలా చేయని వారి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

గతంలో ఏడాదికి సగటున 20 నుంచి 30 వెంచర్లు ఏర్పాటయ్యేవని, ప్రస్తుతం నాలుగైదుకు మించడం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 100 నుంచి 200 దస్తావేజులు కూడా రిజిస్టర్ కావడం లేదు. రూ. 50 లక్షల ఆదాయం కూడా ఖజానాకు చేరని పరిస్థితి నెలకొంది.

బ్లాక్ లిస్ట్‌లో 180 ఎకరాలు

కూటమి నాయకులు పట్టణంలో ఎక్కువగా స్థిరాస్తి వ్యాపారం జరిగే బెంగళూరు రోడ్డులోని సర్వే నంబర్ 630, 631 మొదలుకుని 180 ఎకరాల దాకా రిజిస్ట్రేషన్లు కాకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించారు. ఈ భూముల్లో గతంలో ప్లాట్లు కొనుకున్న వారు కూడా ప్రస్తుతం విక్రయించుకునే వీలు లేకుండా పోయింది. ఎవరైనా అత్యవసరం కోసం ప్లాట్లు విక్రయించాలనుకున్నా కూటమి నేతలకు ముందుగానే కప్పంకట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

న్యూస్‌రీల్

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హిందూపురం: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శనివారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని సప్తఫణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ సప్తఫణి సుబ్రహ్మణ్య స్వామిని వెండి ఆభరణాలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. పంచమృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచాలి



న్యాయవాదులతో చర్చిస్తున్న జడ్జి శైలజ

హిందూపురం అర్బన్: మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ న్యాయవాదులకు సూచించారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, వివిధ కేసుల్లోని ఇరువర్గాలను పిలిపించి ప్రశాంత వాతావరణంలో చర్చిస్తే సగం కేసులు పరిష్కారమవుతాయన్నారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులంతా కృషి చేయాలన్నారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీపీ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, సీనియర్ న్యాయవాదులు రఘునాథరెడ్డి, సిద్దు, సత్యనారాయణ, యూసుఫ్, సందీప్, వేణుగోపాల్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమించారు

- మాజీ మంత్రి 'పల్లె' అండతో దౌర్జన్యం
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



విలేకరులతో మాట్లాడుతున్న నాగమ్మ, కుటుంబసభ్యులు

పుట్టపర్తి టౌన్: తమ భూమిని కొందరు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని ముదిగుబ్బ మండలం బ్రహ్మసముద్రం కొట్టాలుకు చెందిన నాగమ్మ, ఆమె కుమారులు వాపోయారు. అక్రమార్కులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అండగా నిలిచి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు బాధితులు శనివారం ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేయడానికి పుట్టపర్తికి వచ్చారు. అయితే ఎస్పీ, ఏఎస్పీ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ఊరు విడిచినా.. కరుణించడం లేదు

తనకు ముదిగుబ్బ మండలం గొండ్లవారిపల్లి పంచాయతీ బ్రహ్మసముద్రం కొట్టాలు గ్రామంలోని సర్వేనంబర్ 179–5, 178–12, 195–2, 199–4, 154–2లో 10.66 ఎకరాల భూమి ఉందని నాగమ్మ తెలిపారు. తనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారన్నారు. వ్యవసాయం చేసుకుంటూ తాను జీవనం సాగిస్తుండగా.. గ్రామానికే చెందిన చిన్న ఉత్తప్ప, పెత్త ఉత్తప్పలు భూమిని ఆక్రమించి దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. ఆక్రమణదారులతో ఘర్షణ నేపథ్యంలో తాము గ్రామం వదిలి వెళ్లిపోయామన్నారు. ప్రస్తుతం ఆభూమిని గుత్తకు కూడా ఇవ్వనియ్యకుండా బెదిరిస్తున్నారు. అక్రమార్కులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అండగా నిలవడంతో పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేసేందు వచ్చామని తెలిపారు. సోమవారం మరోసారి వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తామని నాగమ్మ విలేకరులకు తెలిపారు.

అలరించిన 'సాయికృష్ణ కృప'



ఏకాదశి రుద్రాభిషేక మంత్రాలు పఠిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: శ్రీ కృష్ణుడి లీలా వైభవాన్ని చాటుతూ నిర్వహించిన భక్తిరస నాటిక అందరినీ అలరించింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన రంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు శనివారం సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సుమారు 3 వేల మంది భక్తులు సామూహిక శివస్తోత్ర పఠనం చేశారు. ఈ సందర్భంగా జీవనోపాధుల కల్పనలో భాగంగా రంగారెడ్డి జిల్లా భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు కుట్టుమిషన్లు, ఎలక్ట్రిక్ సామగ్రి, త్రిచక్ర వాహనాలు అందజేశారు. సాయంత్రం సత్యసాయి రచించిన భాగవతా వాహిని రచన ఆధారంగా రంగారెడ్డి జిల్లాకు చెందిన సత్యసాయి యూత్ సభ్యులు 'సాయి కృష్ణ కృప' పేరుతో నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీ కృష్ణుడు సత్యసాయి లీలా వైభవాన్ని చక్కగా వివరించారు.



నాటికలోని ఓ ఘట్టం

మత్తుకు దూరంగా ఉండండి

- భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోండి
- విద్యార్థులకు ఎస్పీ రత్న పిలుపు
- 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్ల ఆవిష్కరణ



'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రత్న, అధికారులు

ధర్మవరం అర్బన్: జీవితాలను అంధకారం చేసే మత్తుకు దూరంగా ఉండి భవితకు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్పీ వి.రత్న విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సమష్టిగా కృషి చేస్తే జిల్లాను మత్తు రహితంగా తీర్చిదిద్దవచ్చన్నారు. కొందరు యువకులు గంజాయికి అలవాటుపడి బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం గంజాయి విక్రయాలు, సేవనాన్ని కట్టడి చేసేందుకు 'ఈగల్' పేరుతో యాంటి డ్రగ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు, వినియోగం గురించి ఎవరికైనా తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే గంజాయిని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనించండి

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని, ఏదైనా తేడాగా అనిపిస్తే వెంటనే వివరాలు ఆరా తీసి వారు చెడుమార్గంలో పయనించకుండా కట్టడి చేయాలని ఎస్పీ రత్న సూచించారు. పిల్లలు రోజు బడికి వెళ్తున్నారా... ఎవరితో వెళ్తున్నారు, ఎప్పుడొస్తున్నారు అనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలన్నారు. అలాగే వేధింపులు, మాయమాటలు చెప్పి మోసం చేయడం లాంటి ఘటనలు ఇటీవల ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని, ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ రెడ్డప్ప, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురికి మూడేళ్ల జైలు శిక్ష

- అదనపు కట్నం వేధింపుల కేసులో జడ్జి శోభారాణి తీర్పు

అనంతపురం: అదనపు కట్నం వేధింపుల కేసులో నలుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... ముదిగుబ్బ మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి తన కుమార్తె స్రవంతిని కొత్తచెరువులోని దర్గా వీధికి చెందిన ఓం ప్రకాశ్‌రెడ్డికిచ్చి 2015లో వివాహం జరిపించారు. ఆ సమయంలో 10 తులాల బంగారం ఇచ్చారు. పెళ్లయిన కొన్నిరోజులకే అదనపు కట్నం కోసం ఓంప్రకాశ్‌రెడ్డి భార్య స్రవంతిని వేధింపులకు గురిచేశాడు. ఇందుకు అతని కుటుంబీకులు ఆదిలక్ష్మి, శివారెడ్డి, ప్రశాంతి మద్దతు పలికారు. రోజురోజుకూ వారి వేధింపులు ఎక్కువ కావడంతో స్రవంతి విషయాన్ని తండ్రికి తెలియజేసింది. దీంతో ఓంప్రకాష్‌రెడ్డి కుటుంబీకులంతా కలిసి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించారు. అంతేకాకుండా చీరను గొంతుకు బిగించి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో భయపడిపోయిన స్రవంతి 2017 ఏప్రిల్ 21న కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతపురంలోని సెషన్-4 కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో జడ్జి శోభారాణి శుక్రవారం తుది తీర్పు వెల్లడించారు. నలుగురు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజన వాదించారు.

మొక్కు బడి కార్యక్రమం

- తూతూ మంత్రంగా మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్
- సగంమంది తల్లిదండ్రులు కూడా హాజరుకాని వైనం



సోమందేపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత



కొడికొండలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి/చిలమత్తూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్న 'మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్' సమావేశాలు జిల్లాలో శనివారం మొక్కుబడిగా సాగాయి. వారం రోజులుగా దీనిపై పెద్ద ఎత్తున కసరత్తు చేసినా తల్లిదండ్రులు నుంచి మాత్రం స్పందన కనిపించలేదు. బుక్కపట్నంలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో 250పైనే విద్యార్థులున్నా...ఆ రెండు పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో తల్లిదండ్రుల సంఖ్య 50కి మించలేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూళ్లలోనూ తల్లిదండ్రులు పెద్దగా హాజరు కాలేదు. తల్లులకు రంగవల్లులు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలని ఆదేశించినా చాలాచోట్ల ఈ పోటీలు జరగలేదని తెలిసింది. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందరి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించినా... చాలా స్కూళ్లలో పూర్తిస్థాయిలో అందివ్వలేకపోయారు. జిల్లాలోని 2,061 ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించినట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు.

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్ సోమందేపల్లి, చిలమత్తూరు మండలం టేకులోడు పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రభుత్వ బడులలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే వారంలో ఒకసారైన తల్లిదండ్రులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ప్రోగ్రెస్ తెలుసుకోవాలని సూచించారు.
- చిలమత్తూరు మండలం కోడూరు, కొడికొండ పాఠశాలల్లో జరిగిన 'మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్' సమావేశాల్లో కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన చేయాలని అప్పుడే పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందన్నారు.

మంత్రి కోసం పడిగాపులు

మంత్రి సవిత చిలమత్తూరు జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో జరిగే పేరెంట్స్ మీట్‌లో పాల్గొనేందుకు ఉదయం 10.30 గంటలకు వస్తారని సమాచారం అందడంతో అధికారులు ఉరుకులు, పరుగులు తీశారు. విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించారు. కానీ మంత్రి తీరిగ్గా సాయంత్రం పాఠశాలకు రాగా, అప్పటికే తల్లిదండ్రులంతా వెళ్లిపోయారు. అధికారులు మాత్రం మంత్రి రాకకోసం పాఠశాలలోనే వేచి చూస్తూ గడిపారు. విద్యార్థులను కూడా సాయంత్రం వరకూ ఆవరణలోనే కూర్చోబెట్టారు.

క్లుప్తంగా

సైనికుల సంక్షేమానికి విరాళాలు ఇవ్వండి


ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు

అనంతపురం: దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికులకు, మాజీ సైనికుల సంక్షేమానికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ,అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఇరు జిల్లాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, కరపత్రాలను అన్ని వర్గాల ప్రజలకు, అధికారులకు, ఉద్యోగులకు, దాతలకు అందజేశారు. వీర జవాన్ల కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. శనివారం ఉదయం అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి పి. తిమ్మప్ప, మాజీ సైనికుల సంఘం నాయకులు కెప్టెన్ షేకన్న, విశ్వేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, కళాశాల ఎన్‌సీసీ అధికారులు రామాంజినేయులు, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో ...


డ్రగ్స్ అనర్థాలను వివరించేలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ' మెగా టీచర్స్ పేరెంట్ 'సమావేశాలకు హాజరవుతున్న విద్యార్థులకు పోలీసులు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు అవగాహన సదస్సుల్లో పాల్గొంటూ అనర్థాలను వివరిస్తున్నారు.

త్వరలో ధాన్యం కొనుగోళ్లు

కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టు ప్రాంతమైన కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో త్వరలో వరికొనుగోళ్లను ప్రారంభిస్తామని పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వరికొనుగోళ్ల ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ రూ.2,320, సాధారణ రకం రూ.2,300 తో కొనుగోలు చేస్తామన్నారు.

పంట పొలాల్లో పశ్చిమ రాగం


అరటి తోటల వద్దకు పోతున్న వలస కూలీలు

- అరటి తోటల్లో బెంగాల్ కూలీల సాయం
- నెలల తరబడి ఇక్కడే పనులు
- కూలీల కొరత తీరిందంటున్న రైతులు

పొట్టకూటి కోసం వందల కిలోమీటర్లు దాటి వస్తున్నారు ఎందరో కూలీలు. కుటుంబాలతో సహా తరలివచ్చి గ్రామ శివార్లలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో కొందరు రైతులు, వ్యాపారులు బయటి రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు. ఇక్కడ కూలి గిట్టుబాటు అవుతోందని వారు కూడా ఎంతో సంతోషంగా పనులు చేస్తున్నారు.


పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కూలీలు

యాడికి: వ్యవసాయ పనులకు కూలీల కొరతతో అల్లాడుతున్న రైతాంగానికి వలస కూలీలతో ఉపశమనం లభిస్తోంది. ఉపాధి కోసం వలస కూలీలు సొంత ఊర్లను వదిలి ఇక్కడికి వచ్చి గ్రామ శివార్లలో రేకుల షెడ్లలో జీవనం సాగిస్తున్నారు. చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూనే పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

అరటి పంటకు వలస కూలీలే దిక్కు

యాడికి మండలంలోని 14 పంచాయతీల్లో 1900 ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. అరటి పంటలో మొక్కలపైన, కింద విష పురుగుల ఉంటాయి. దీంతో స్థానికంగా ఉన్న కూలీలు భయపడుతూ కూలి పనులకు రావడం లేదు. కూలీల కొరత ఉండటంతో ఈ ప్రాంత రైతులు వలస కూలీలపై ఆధారపడుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మల్దా జిల్లాకు చెందిన కూలీలు ఉపాధి నిమిత్తం 200 మందికిపైగా ఇక్కడికి వస్తుంటారు. రైతులు వారికి కొంత డబ్బు అడ్వాన్స్‌గా చెల్లించి అరటి గెలలకు మందును స్ప్రే చేసేందుకు , గెలలు కోత కోసేందుకు, వాటిని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసేందుకు రప్పించుకుంటున్నారు. యాడికి మండలంలోని రాయలచెరువు, చందన గ్రామాల్లో వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. 2018 నుంచి నేటి వరకూ మండలంలోని చందన గ్రామానికి చెందిన వరదారెడ్డి గారి శంకర్ రెడ్డి తోటల్లో 200 మంది కూలీలు పని చేస్తున్నారు.

ఏడు నెలల ఉపాధి

ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు తమ బంధువులు, స్నేహితులతో కలిసి ఇక్కడికి వస్తుంటారు. చందన గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి తన వ్యవసాయ బోరుబావుల వద్ద దాదాపు అర ఎకరా స్థలంలో పెద్ద ఎత్తున రేకుల షెడ్డులు వేసి విద్యుత్ సౌకర్యం, నీటి వసతి కల్పించారు. శంకర్‌రెడ్డి తనకున్న వ్యవసాయ తోటల్లో అరటి సాగు చేశారు. అలాగే మరో 300 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతులు అరటి సాగు చేశారు. వారి పంటను శంకర్‌రెడ్డి కొనుగోలు చేస్తుంటారు. అక్టోబర్ నుంచి అరటి మొక్కలకు ,గెలలకు మందులను స్ప్రే చేయిస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత 10 వేల టన్నుల అరటి కాయలను బాక్సుకు రూ. 25ల చొప్పున ప్రత్యేకంగా 20 మందిని ఒక టీమ్‌గా ఏర్పరచి ప్యాకింగ్ చేయిస్తారు. ప్యాకింగ్ చేసిన అరటి బాక్సులను ఏసీ కంటైనర్ ద్వారా ముంబయి తరలించి అక్కడి నుంచి సముద్ర మార్గంగుండా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పంటపై మందు స్ప్రే చేసేందుకు రోజూ కూలి రూ.500 నుంచి రూ.700 వరకూ చెల్లిస్తుంటారు. అరటిని ప్యాకింగ్ చేసేరోజు టీమ్‌లోని ప్రతి వలస కూలీ రూ. వెయ్యి వరకూ సంపాదిస్తుంటారు. ఇలా ఏడు నెలల వరకూ ప్రతి కూలీకి ఉపాధి దొరుకుతోంది.

ఉమ్మడి జిల్లా అంతటా...

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ వలస కూలీలు వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ముఖ్యంగా ఇటుకల బట్టీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూలీలుగా పనిచేస్తున్నారు. అలాగే హిందూపురం, అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం తదితర ప్రాంతాల్లోనూ గృహ నిర్మాణ పనుల్లో వలస కూలీలే ఎక్కువగా పనిచేస్తున్నారు.

రెండేళ్లుగా వస్తున్నాం



మాది పశ్చిమ బెంగాల్‌లోని మల్దా జిల్లా. రెండేళ్లుగా యాడికి మండలంలో అరటి పంటలో కూలీలుగా వస్తున్నాం. మా ప్రాంతంలో పంటలు పూర్తిగా దెబ్బతిని ఉపాధి కరువైంది. అరటి పంటలో పనులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడికి వచ్చాం. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ ఇక్కడే ఉండి పని పూర్తయిన తర్వాత మా గ్రామానికి వెళ్తాం.

– మానున్, మాల్దా జిల్లా, పశ్చిమ బెంగాల్

కూలి గిట్టుబాటు అవుతోంది



మా గ్రామంలో పని దొరకక వలస వస్తున్నాం. మా ఊర్లో పని చేస్తే రోజు కూలి రూ.300 ఇస్తారు. అయితే యాడికి మండలం చందనలో రూ. 500 నుంచి రూ.1000 వరకూ దొరుకుతోంది. కూలి గిట్టుబాటు అవుతోంది. పొట్ట కూటి కోసం వస్తున్నా ఆనందంగానే పనిచేసుకుంటున్నాము.

– సాజన్, మాల్దా జిల్లా, పశ్చిమ బెంగాల్

అన్ని సౌకర్యాలు కల్పించాం



ఏడేళ్లుగా అరటి కాయల వ్యాపారం చేస్తున్నాను. నా దగ్గర పశ్చిమ బెంగాల్‌కు చెందిన 200 మంది వలస కూలీలు ఉన్నారు. అరటి కాయలను బాగా ప్యాకింగ్ చేస్తారు. వారు ఉండేందుకు 3 షెడ్డులు ఏర్పాటు చేయటమే కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాము.

– శంకర్‌రెడ్డి, అరటి కాయల వ్యాపారి, యాడికి

ఫేక్ పట్టాలపై అధికారుల కొరడా

- నకిలీ పట్టాలతో పేదలను నిలువునా ముంచిన వ్యక్తికి కటకటాలు
- మిగతా వారిపైనా దృష్టిసారించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రాప్తాడురూరల్: అనంతపురం నగరంలో సొంతిల్లు నిర్మించుకోవాలనే నిరుపేదల ఆశలను ఆసరాగా చేసుకుని ఫేక్ పట్టాలు సృష్టిస్తున్న వారి భరతం పడుతున్నారు అధికారులు. 'సాక్షి' దినపత్రికలో ఇటీవల వరుసగా 'అమ్మేశారు...ముంచేశారు', 'రూ. 5 వేలు కొట్టు.. పట్టా పట్టు', 'రూపాయికో పట్టా' శీర్షికలతో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. తహసీల్దార్ మోహన్‌కుమార్...రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా అనంతపురం రూరల్ కురుగుంటకు చెందిన ఎస్.నాగభూషణం ఇంటిపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. కొన్ని నకిలీ పట్టాలను గుర్తించి సీజ్ చేశారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

కూపీ లాగుతున్న రెవెన్యూ అధికారులు

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి, కురుగుంట, రాచానపల్లి, సోములదొడ్డి, కొడిమి, చిన్నంపల్లి, కక్కలపల్లికాలనీ పంచాయతీల పరిధిలో అక్రమార్కులు రెచ్చిపోయారు. నకిలీ పట్టాలతో అవసరాన్ని బట్టి రూ. 20 వేల నుంచి రూ. 50 వేలదాకా వసూళ్లకు పాల్పడి రూ.కోట్లు వెనుకేసుకున్నారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి చూపిస్తుంటే తమ పేర్లు రికార్డుల్లో లేవని అవన్నీ నకిలీ పట్టాలని చెబుతున్నారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన కొందరు బాధితులు అధికారులను కలిసి నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు కూపీ లాగుతున్నారు. నకిలీ పట్టాలు అంటగట్టిన వారిపై డేగకన్ను పెడుతున్నారు. బాధితులతో ఫిర్యాదులు తీసుకుని నేరుగా క్రిమినల్ కేసులు పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. నకిలీ పట్టాలు సృష్టికర్తల్లో వణుకు పట్టుకుంది. కురుగుంట సమీపంలో ఓ ఆటో డ్రైవర్ ఇంట్లోనూ నకిలీ పట్టాలతో పాటు తహసీల్దార్ సీలు, కార్యాలయం సీలు ఉంచుకున్నట్లు తెలిసింది. నకిలీ పట్టాలు సృష్టించి పేదలను నిలువునా మోసగించి డబ్బులు వసూళ్లు చేసిన ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోహన్ కుమార్ తెలిపారు. బాధితులు నేరుగా వచ్చి తనకు ఫిర్యాదు చేయాలన్నారు.


భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం


క్యూలైన్లో వేచివున్న భక్తులు

కదిరిటౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. మొక్కులు ఉన్నవారు తలనీలాలు సమర్పించి దీపాలు వెలిగించారు.


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ (26) ఆర్థిక ఇబ్బందులతో శనివారం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసుల వివరాలమేరకు.. నరేష్ వాళ్ల నాన్న వెంకటేష్ పొలంలో బోర్లు వేసి అప్పులు చేశాడు. ఇటీవల నరేష్ తండ్రి మరణించాడు. మరోవైపు నరేష్ వివాహం చేసుకున్న కొద్ది రోజులకే అతని భార్య వదిలేసి వెళ్లి పోయింది. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు భార్య వదిలేసిందన్న మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేవగానే నరేష్ వాళ్ల అమ్మ నాగలక్ష్మి, తమ్ముడు తిరుమల రాజు బయటకు వచ్చి చూడగా చెట్టుకు నరేష్ వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి


మృతుడు కంబగిరి

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం నడిపి కంబగిరి (60) అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల వివరాలమేరకు.. నంద్యాల జిల్లా కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి చిత్తూరులోని గ్రానైట్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. చిత్తూరుకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం కనకాద్రిపల్లిలో బస్సు ఎక్కి తాడిపత్రికి వచ్చారు. రైలు ఎక్కి చిత్తూరుకు వెళ్లడానికి తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. మొదటి ప్లాట్ ఫారం చివరిలో తీవ్ర గాయాలతో పడి ఉన్న కంబగిరి గురించి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి అనుమానాస్పద మృతిగా ఉండటంతో తాడిపత్రి పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. మృతి దగ్గర లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బేల్దార్లపై పోకిరీల రాళ్ల దాడి


తీవ్రంగా గాయపడిన నాగేంద్ర

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కృష్ణాపురం ఒకటో రోడ్డులో పోకిరీల రాళ్ల దాడిలో ముగ్గురు బేల్దార్లకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని కృష్ణాపురం ఒకటో రోడ్డులో ఇద్దరు పోకిరీలు గొడవ పడుతూ రాయి వేయడంతో చిన్నపాపతో స్కూటీపై వెళ్తున్న మహిళకు తగిలింది. పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న బేల్దార్లు జయనగర్ కాలనీ చెందిన సుబ్బరాయుడు, టైలర్స్ కాలనీకి చెందిన శంకర్ నారాయణ, విజయనగర్ కాలనీకి చెందిన నాగేంద్రలు గమనించి పోకిరీలను ప్రశ్నించారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లి దాదాపు 20 మందితో వచ్చి బేల్దార్లపై రాళ్ల వర్షం కురిపించారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నాగేంద్ర పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన శంకర్‌నారాయణ, సుబ్బరాయుడు

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గుంతకల్లు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీ.శివసాగర్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక బీరప్ప గుడి సర్కిల్‌లో తనిఖీలు చేస్తుండగా బళ్లారి వైపు నుంచి వస్తున్న కారు (ఏపీ40 బీకే 1520)లో కర్ణాటక మద్యాన్ని గుర్తించామన్నారు. కారులో ఉన్న అంజన్ పవన్ కుమార్, బోయ వాసులను అదుపులోకి తీసుకుని దాదాపు 20 బాక్సుల (టెట్రా ప్యాకెట్లు 1950) మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే మండల పరిధిలోని ములకలపెంట శివారులోని 550 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ సుశీలమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్బయ్య, వెంకటేష్, కానిస్టేబుళ్లు మారుతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో

- సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు


సమగ్ర శిక్ష కార్యాలయం

అనంతపురం ఎడ్యుకేషన్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల పరిస్థితి. సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేస్తున్న నాగరాజును నవంబరు 30న డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన అదేరోజు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటిదాకా ఎవరికీ ఇన్‌చార్జ్ ఇవ్వలేదు. దీంతో సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు నవంబరు జీతాలకు కొర్రీ పడింది. రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల్లోనూ ఉద్యోగులకు వేతనాలు పడ్డాయి. అనంతపురం జిల్లాలో మాత్రం ఏపీసీ లేని కారణంగా నేటికీ జీతాలు జమ కాలేదు.

1500 మంది ఉద్యోగుల ఎదురుచూపు

సమగ్ర శిక్ష పరిధిలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎమ్మార్సీ ఉద్యోగులు ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఐఈఆర్పీలు, ఆయాలు, ఫిజియోథెరపిస్టులు, ఇంజినీరింగ్ విభాగంలో సైట్ ఇంజినీర్లు, మోడల్ స్కూళ్లలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డీపీఓలోని రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 1500 మంది పని చేస్తున్నారు. నవంబరు నెలకు సంబంధించి వేతనాల బడ్జెట్ రూ. 3.19 కోట్లు ఈనెల 2న ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఏపీసీ లేని కారణంగా జీతాలు ఇంత వరకూ పడలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికైనా అప్పగించి జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు

- నివ్వెర పోయిన విజిలెన్స్ అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక

అనంతపురం/అనంతపురం రూరల్: ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిపై విజిలెన్స్ అధికారులు నివ్వెరపోయిన పరిస్థితి నెలకొంది. నగరంలోని లక్ష్మీ నగర్ కాలనీ గంగమ్మ గుడి వద్ద ఉన్న ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్ నెంబర్–2ను విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఇందులో విస్తుపోయే అంశాలను విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. 111 మంది విద్యార్థులకుగాను 4 స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అత్యంత అపరిశుభ్రంగా ఉన్నాయి. హాస్టల్ వంట సరుకుల నిల్వ, హాజరు పట్టిక, బయోమెట్రిక్ హాజరులోనూ వ్యత్యాసాలున్నాయి. విద్యార్థుల గదులు, వంట గది, స్నానపు గదులు, మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. హాస్టల్ వార్డెన్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఏఓ జే.వాసు ప్రకాష్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి, హాలులోనే భోజనం వండుతున్న వైనం